

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అయ్యప్ప కాలనీవాసులు

సమస్యలు పరిష్కరిస్తా!

» ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో బాక్స్ డ్రైన్ నిర్మాణం కారణంగా పైప్‌లైన్లు పాడయ్యాయని, మ్యాన్‌హోల్స్ పొంగి పొర్లుతున్నాయని, ఎగువ నుంచి డ్రైనేజి నీరు, వర్షపు నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నామని, కొత్త పైప్‌లైన్స్ ఏర్పాటుచేయాలని, రోడ్లు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడానని, ఎన్నికల అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు నర్సింహచారి, రవికాంత్ శర్మ, సుదర్శన్, గోపాల్ పాల్గొన్నారు.



హనుమాన్ దేవస్థానంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

హనుమాన్ ఆలయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పూజలు

చంపాపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలోని వినాయకస్వామి, ధ్యానాంజనేయ స్వామిని మంగళవారం మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుప రాజ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, ధర్మకర్తలు అంజిరెడ్డి, మేక సురేందర్‌రెడ్డి, నాయకులు ఉమామహేశ్వర్, సదానంద్‌రెడ్డి, బొంబాయి, చేగోని మల్లేష్‌గౌడ్, చందూయాదవ్, ప్రభాకర్, నందు, శివగౌడ్, జగదీష్, వసంత్ కుమార్, కొండ యాదగిరి ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

చోరీ చేసిన వాహనాలతో స్టంట్లు

» సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు

» ఫేమస్ అవుదామని అరెస్టయ్యారు..

» బేగంపేటలో ఇద్దరు అరెస్టు.. 9 ద్విచక్రవాహనాలు స్వాధీనం

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలతో విన్యాసాలు చేసి ఫేమస్ కావాలనుకున్నారు.. పలు రకాల వాహనాలతో విన్యాసాలు చేసి.. వాటిని వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగులు పెట్టారు... ఇంత వరకు బాగానే ఉంది. అయితే వీరు విన్యాసాలు చేసిన వాహనాలు చోరీ చేసినవని గుర్తించిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టి వారి వద్ద నుంచి 9ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టరు రామయ్య, డీఐ మల్లేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. చాంద్రాయణగుట్ట సమీపంలోని షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం(19), బేగంపేట పాటిగడ్డకు చెందిన బాలుడు కలిసి నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నారు. దొంగిలించిన వాహనాల నంబరు ప్లేట్లను తొలగించి షాహీన్‌నగర్‌లోని నగర శివారు ప్రాంతాల్లో స్టంట్లు నిర్వహించేవారు. వీరు చేసిన విన్యాసాలను వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులతో పోస్టు చేస్తుండేవారు. బేగంపేటలోని తన వాహనం చోరీకి గురైందని స్మిత పటేల్ ఈ నెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలను విశ్లేషించగా చోరీకి గురయిన వాహనాలు షాహీన్‌నగర్‌లో నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్నాయని గుర్తించారు. దీంతో అడ్మిన్ ఎస్సై గంగాధర్ నేతృత్వంలో క్రైం పోలీసులు షాహీన్‌నగర్ వెళ్లి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులు షేక్ ఇబ్రహీం, మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను చోరీచేసి వాటి మీద విన్యాసాలు చేస్తూ ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో పోస్టులు పెట్టి తద్వారా ఫేమస్ కావాలనుకున్నామని వీరు పోలీసులకు తెలిపారు. ఎస్సార్‌నగర్ పరిధిలో రెండుసార్లు, సనత్‌నగర్‌లో 3సార్లు హుమాయున్‌నగర్, రాంగోపాల్‌పేట, ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కసారి వాహనాల చోరీలకు పాల్పడినట్లు వీరు పోలీసుల విచారణలో వెల్లడించారు. నిందితుల నుంచి డియో వాహనాలు 7, జుపిటర్ 1, యమహా ఆర్ఎక్స్ 1 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

జాతీయ స్థాయిలో బంగారు పతకానికి డాక్టర్ రేష్మ ఎంపిక



గోల్నాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జైస్వాల్ గార్డెన్ నివాసి వినోద్‌కుమార్, శారద దంపతుల కుమార్తె ఈఎన్‌టీ డాక్టర్ బహునూతల రేష్మ జాతీయ స్థాయిలో బంగారు పతకానికి ఎంపికయ్యారు. 2021లో జరిగిన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్స్‌కు(ఎన్‌బీఈఎంఎస్) జాతీయస్థాయిలో నిర్వహించిన ఈఎన్‌టీ విభాగంలో డీఎన్‌బీ తుది పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించి డాక్టర్ ఎస్. కామేశ్వరన్ బంగారు పతకానికి ఎంపికయ్యారు. ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన రేష్మ 2021లో కాళోజీనారాయణరావు ఆరోగ్య వర్సిటీ నిర్వహించిన పీజీ డిగ్రీ పరీక్షల్లో అన్ని స్పెషాల్టీస్‌లో టాపర్‌గా నిలిచారు. ఆమె ప్రస్తుతం కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. మే 10న న్యూఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా రేష్మ బంగారు పతకం అందుకోనున్నారు. ఆమెకు జైస్వాల్ గార్డెన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దంపతుల గొడవ.. భర్త ఆత్మహత్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య గొడవతో మనస్తాపం చెందిన భర్త రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట శంకర్‌నగర్‌లో ఎన్. సుదర్శన్(63), సుజాత దంపతులు నివస్తున్నారు. సుదర్శన్ విశ్రాంత ఉద్యోగి. కొద్ది రోజుల నుంచి భార్యాభర్తలు గొడవపడుతున్నారు. మనస్తాపం చెందిన సుదర్శన్ మంగళవారం మలక్‌పేట-కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య తిలక్‌నగర్ బ్రిడ్జి సమీపంలో ఎంఎంటీఎస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

రాములోరి కల్యాణం చూతము రారండి..

» కోదండ రామస్వామి ఆలయానికి 400 ఏళ్ల చరిత్ర

» వేడుకలకు ఆలయం ముస్తాబు

» భద్రాచలం ముహూర్తానికే ఇక్కడ కల్యాణం



ప్రత్యేకాలంకరణతో భక్తులకు దర్శనమిస్తున్న సీతారామాంజనేయస్వామి



కోదండ రామచంద్రస్వామి ఆలయం



కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం ముఖద్వారం, రాజగోపురం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలోని కోదండ రామచంద్రస్వామి కల్యాణ, రథోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోనే అత్యంత పురాతన ఆలయాల్లో ఒకటిగా కోదండ రామచంద్రస్వామి ఆలయం పేరుగాంచింది. ఆలయానికి సుమారు 400 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు. ప్రతి ఏడాది భద్రాచలంలో జరిగే కల్యాణ ముహూర్త సమయానికే ఇక్కడ కూడా కల్యాణం నిర్వహిస్తారు. గ్రామస్తులు, ఉత్సవ కమిటీ కలిసి వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. గురువారం రథోత్సవం సందర్భంగా ఆర్కేస్ట్రాతో పాటు విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, లంకాదహనం నిర్వహిస్తారు. ఆలయానికి సమీపంలో రావణలంకతో పాటు భారీ రావణాసురుడి ప్రతిమను ఏర్పాటు చేస్తారు. ప్రతి ఏటా ఇక్కడ లంకాదహనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వేలాది మంది భక్తులు తిలకిస్తారు.

ముస్తాబైన హనుమాన్ ఆలయం

చంపాపేట : కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానం సీతారాముల కల్యాణ మహోత్సవానికి ముస్తాబైంది. బుధవారం ఉదయం 5 గంటలకు అభిషేకాలు, అలంకరణ, 8 గంటలకు విష్ణు సహస్ర పారాయణం, 9 గంటలకు ఎదుర్కోళ్లు, స్వామి వారు కల్యాణ మండప ప్రవేశం, 10 గంటలకు సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు తెలిపారు. దేవాదాయ శాఖ తరపున సీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందించనున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల గరుడ వాహన తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.516 రూపాయల టికెట్ పొందవచ్చని, దాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించనున్నట్లు వారు తెలిపారు. కల్యాణం వీక్షించేందుకు వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు, మంచినీరు, మజ్జిగ పంపిణీ, అన్నప్రసాద ఏర్పాటుచేశారు. జంటనగరాలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ చైర్మన్, ఈఓ కోరారు.

వేయిమంది భక్తులకు అన్నదానం

సొంత ఖర్చుతో వేయి మంది భక్తులకు అన్నదానం చేస్తున్నట్టు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఆలయం తరపున అన్నప్రసాదం అందజేస్తామని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు.

ముస్తాబైన ఆలయాలు

సైదాబాద్ : శ్రీరామనవమి వేడుకలకు సైదాబాద్, మాదన్నపేట, అక్బర్‌బాగ్, ఐఎస్‌సదన్ డివిజన్లలోని ఆలయాలను ముస్తాబుచేశారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు వీలుగా చలువ పందిళ్లు, టెంట్లు వేశారు. చావునీ ఉప్పరిగూడ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమై ఏప్రిల్ 21 వరకు కొనసాగనున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

చాదర్‌ఘాట్ : దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపో పక్కన ఉన్న సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 9న సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామివార్లకు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం పంచామృతాభిషేకం, ఉదయం 7.30 గంటలకు మహామంగళహారతి, 11.15 గంటలకు కల్యాణం, సాయంత్రం 7 గంటలకు స్వామి వారి ఊరేగింపు సేవ నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తాం

» మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తీగల, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సీనియర్ నాయకుడు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. తీగల కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మేయర్ పారిజాతరెడ్డి, అమరేందర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి నిజాముద్దీన్, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బేర బాలకిషన్, డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పారిజాతరెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని అర్బన్ ప్రాంతాన్ని మంత్రిగా ఉన్నప్పుడు సబితా ఇంద్రారెడ్డి పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. అర్బన్ ప్రాంతంలో అత్యధికంగా బడుగు, బలహీనవర్గాల ప్రజలే ఉంటున్నారని చెప్పారు. అర్బన్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ తీసుకురావడానికి పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరింటిలో అయిదు అమలు చేసి చూపించిందన్నారు. ఎన్నికల కోడ్ అయిపోగానే ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి పేదలకు రేషన్ కార్డులు అందేవిధంగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సరూర్‌నగర్ డివిజన్ ప్రధానకార్యదర్శి ఇమ్రాన్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ గుల్షన్, ఏనుగు జంగారెడ్డి, అలీబాయ్, షఫీ, చిక్కుల శివప్రసాద్, రంజిత్, అరుణక్క, బాస్కర్, జంగారెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ వల్లనే హక్కులు!

» ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

హయత్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లనే అందరం సంతోషంగా జీవిస్తున్నామని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. హయత్‌నగర్-2 బస్ డిపోలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేడ్కర్ గొప్పదనం వల్లనే నేడు ప్రపంచం మన వైపు చూస్తుందన్నారు. అనంతరం అధికారులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జోన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, హయత్‌నగర్ సహాయ రీజినల్ మేనేజర్ సుచరిత, హయత్‌నగర్-1, 2 డిపోల మేనేజర్లు శ్రీనివాస్, విజయ్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు యాదయ్య, నాయకులు శ్రీనివాస్, విశాల్, నరసింహ, మైసయ్య, శ్రీనివాస్, యాదగిరి స్వామి, సోమేశ్వర్, పాపారావు, రామకృష్ణ, శంకర్ నాయక్, నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ హరి అన్నారు. మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ డిపోలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిపో సీఐ వెంకన్న, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆనంద్. కనకయ్య, వెల్ఫేర్ కమిటీ సభ్యుడు జీఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను గెలిపించాలి: సామ రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి కోరారు. బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ ఇన్‌చార్జి, బూత్ అధ్యక్షుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో మోదీ సర్కార్ ఉండాలని అన్నారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొంతం నవకిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్తపేట : కొత్తపేట డివిజన్‌లో మరింత అభివృద్ధి కోసం ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా కొత్తపేట సీటీఓ కాలనీలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కరపత్రాలు అందజేస్తూ బీజేపీ ప్రభుత్వం చేడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రచారంలో బూత్ కమిటీల అధ్యక్షులు స్వర్ణ, ప్రవీణ్, బూత్ ఇన్‌ఛార్జులు యూ. రామకృష్ణ, సురేందర్, అనిల్‌కుమార్, తోట మహేందర్ యాదవ్, కొత్త తిరుమల్, లక్ష్మణ్ యాదవ్, మౌనిక, శివ, భూపేందర్ పాల్గొన్నారు.



పోకిరీలకు కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

పోకిరీలపై కఠినచర్యలు : సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలను వేధించే పోకిరీలపై కఠినచర్యలు తీసుకుంటామని, వేధింపులకు గురైన మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మెట్రోస్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీటీం డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, పోకిరీలను పట్టుకొని న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నారని.... తల్లిదండ్రుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారని చెప్పారు. రాచకొండ పరిధిలో 15 రోజుల్లో 122 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకుని షీటీమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్టు తెలిపారు. రాచకొండ పోలీసులు మహిళలకు రక్షణగా ఉంటున్నారని తెలిపారు.

అభాగ్యులను అనాథాశ్రమంలో చేర్పించిన శశాంక్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్, కర్మన్‌ఘాట్ ప్రాంతాల్లోని రోడ్లపై తిరుగుతున్న ముగ్గురు అభాగ్యులను నాదర్‌గుల్‌కు చెందిన అబాకస్ ఓవర్సీస్ అకాడమీ సీఈవో మర్రి శశాంక్‌రెడ్డి గుర్తించి నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలో చేర్పించారు. ఆశ్రమం నిర్వాహకుడు గిరి మాట్లాడుతూ నిర్వహణ కష్టంగా ఉందని, దాతలు నిత్యావసరాలు అందజేసి అభాగ్యుల ఆకలి తీర్చడానికి సహకరించాలని కోరారు.

వినాయకహిల్స్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి

సరూర్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 5వ డివిజన్ పరిధిలోని వినాయకహిల్స్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీ ప్రతినిధులు మంగళవారం కార్పొరేటర్ దీపికారెడ్డి భర్త శేఖర్‌రెడ్డితో కలిసి సాహెబ్‌నగర్‌లోని జలమండలి కార్యాలయంలో వాటర్‌వర్క్స్ జీఎం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

రామాయణం ఆదర్శప్రాయం : మేడసాని

సైదాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేల సంవత్సరాలుగా మానవ జీవితానికి ఆదర్శప్రాయంగా నిలిచిన మహాకావ్యం రామాయణమని టీటీడీ అన్నమాచార్య, అళ్వార్ దివ్య ప్రబంధం, శ్రీమత్ భగవద్గీత ప్రాజెక్టు రిటైర్డ్ డైరక్టర్ మేడసాని మోహన్ అన్నారు. లక్ష్మీనగర్ కాలనీలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ రామనవమి సందర్భంగా మంగళవారం రామాయణ ఇతిహాసాలపై ప్రవచనాలు చెప్పారు. అసోసియేషన్ సౌత్‌జోన్ ప్రధానకార్యదర్శి చలపతిరావు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, సూర్యరావు, వి.అరుణ, గున్న మహేందర్ రెడ్డి, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి మాధవీలత, పక్కన కార్పొరేటర్ అరుణారెడ్డి

మైనార్టీల సానుభూతి కోసమే ఓవైసీ వ్యాఖ్యలు

» బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత

సైదాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అసదుద్దీన్‌ను హత్య చేసేందుకు కుట్రపన్నుతున్నారని అక్బరుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యలు చేయడం మైనార్టీల సానుభూతి కోసమేనని బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్‌లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ సుభాష్‌చందర్జీ, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మంజులా రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వినోద్ గౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

మధుయాష్కీగౌడ్‌ను పరామర్శించిన సీఎం

హయత్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తల్లి అనసూయమ్మ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. మంగళవారం మధుయాష్కీగౌడ్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ కార్యాలయ ప్రతినిధులు, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ నాయకుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కర్నాటక, కేరళ, రాష్ట్రాలకు చెందిన పలువురు నేతలు మధుయాష్కీగౌడ్‌కు ఫోన్ చేసి పరామర్శించారు.

ఓటర్లలో అవగాహన కోసం పసుమాములలో ర్యాలీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పసుమాముల గ్రామంలో మంగళవారం ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని వార్డుల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు హరికుమార్, అశోక్, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీ ఆన్‌లైన్ వ్యాపారం చేసే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్బీనగర్, ఎస్‌బీహెచ్ కాలనీ వెంచర్-3లో ఉంటున్న హరి రవికుమార్ (48) వ్యాపారంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మంగళవారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందులతో మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని మాధవీలత పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యం



కల్యాణ్ (ఫైల్)

సైదాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ ప్రైవేట్ ఉద్యోగి కనిపించకుండాపోయాడు. సింగరేణి కాలనీలో నివాసముండే సుంచు కల్యాణ్ (26) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 12న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తోటి ఉద్యోగులు ఫోన్ చేసి ఆఫీస్‌కు రాలేదని కుటుంబసభ్యులకు తెలియజేశారు. కల్యాణ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. ఆచూకీ కోసం వెదకగా ఫలితం లేకపోవడంతో తండ్రి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌పై మహిళ మృతదేహం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రధాన రహదారిలోని డివైడర్‌పై సోమవారం అర్థరాత్రి గుర్తుతెలియని మహిళ (45) మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహిళ అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి డయల్ 100కు సమాచారమందించారు. మృతురాలు యాచకురాలై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద యువతికి సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దండెం యాదమ్మ, నారాయణరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ పేద యువతి వివాహానికి దండెం మాధవీరాంరెడ్డి దంపతులు పుస్తె, మెట్టెలు, నూతన వస్త్రాలు అందజేశారు. తుర్కయంజాల్‌కు చెందిన అనూషకు ఈ నెల 19న పెళ్లి జరగనుంది. ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని స్థానికులు దండెం యాదమ్మ, నారాయణరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన దండెం మాధవీరాంరెడ్డి మంగళవారం అనూషకు సాయం చేశారు. గతంలో చాలామంది పేద పిల్లల పెళ్లిలకు పుస్తె, మెట్టెలను అందజేసినట్లు దండెం మాధవీరాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పండుగుల రాము, సత్యనారాయణ, పోశయ్య, సుమలత పాల్గొన్నారు.